క్లుప్తంగా

మైసమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి



నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మ దేవాలయం చెంత ఆదివారం భక్తులు సందడి చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని నైవేద్యాలు సమర్పించారు. అలాగే తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేసి అడవిలో సేదతీరారు. కాగా భక్తులకు తాగునీరు, అమ్మవారి దర్శనం కోసం సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

పెన్షనర్లకు న్యాయం చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పెన్షనర్ల దీర్ఘకాలికంగా సమస్యలను పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామదాసు, ప్రధాన కార్యదర్శి నర్సింహ, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారరు. తమ డిమాండ్ల సాధన కోసం పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే జులై 12న ఇందిరా పార్క్‌లో మహాధర్నా నిర్వహిస్తామని వివరించారు.

ఆర్థిక సహాయం అందజేత

మిడ్జిల్: వాడ్యాల్ గ్రామానికి చెందిన చాంద్‌పాషా అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. ఐదువేల ఆర్థికసాయం అందజేశారు. స్థానిక నాయకులు మల్లయ్య ,బాల్‌రాజ్, సమ్మద్ తదితరులు ఉన్నారు.

టీడీపీ అధ్యక్షుడిగా మెట్టుకాడి శ్రీనివాస్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడిగా మెట్టుకాడి శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ భవన్‌లో 23 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించేలా కార్యకర్తలను సమాయత్తం చేయాలని సూచించారు.

దుస్తుల పంపిణీ

మిడ్జిల్: బోయిన్‌పల్లి గ్రామంలో ఆదివారం వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరలను, వంటింటి సరకులు అందజేశారు. అలాగే గ్రామ పంచాయతీకి బెంచీలు వితరణ చేశారు. సర్పంచ్ నారన్‌రెడ్డి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సత్యం గుప్తా, వనితా క్లబ్ మండల అధ్యక్షురాలు లహరి, వాసవి క్లబ్ మండల అధ్యక్షుడు అఖిల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కు అవార్డు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ లక్ష్మీనారాయణ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ ఆనంద్‌కుమార్‌కు ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఆదివారం హన్మకొండలో క్రాంతి జ్యోతి వెల్ఫేర్ సొసైటీ హోమ్ ఫర్ గర్ల చైల్డ్ క్రాంతి మహిళ సాధికారిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అవార్డుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు.

తనిఖీల్లో స్వచ్ఛంద సంస్థలను చేర్చొద్దు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ (తొలిమెట్టు), ఎల్ఐపీల పర్యవేక్షణ, తనిఖీల్లో స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములుగా చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని టీ-పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మరికంటి బాలరాజ్, ప్రధాన కార్యదర్శి విజయభూషణ్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయంతో విద్యా వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందని, అధికారుల ప్రభావం నిర్వీర్యమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహేశ్వరకాలనీలో బోనాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం మధురానగర్‌లోని మహేశ్వరకాలనీలో ఆదివారం బోనాల వేడుక నిర్వహించారు. మైసమ్మ ఆలయానికి భక్తులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఆలయ ధర్మకర్త బోయిని శ్రీనివాసులు, రాధమ్మ పాల్గొన్నారు.

కురిసిన వర్షం హర్షించిన రైతన్న

రాజాపూర్: విత్తనాలు వేసేందుకు అదును కోసం ఎదురు చూస్తున్న రైతుల ఆశలు శనివారం రాత్రి కురిసిన వర్షంతో చిగురించాయి. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆదివారం ఉదయమే అరకలతో పొలంబాట పట్టారు. పత్తి, మొక్కజొన్న తదితర విత్తనాలు వేసే పనులు ముమ్మరంగా చేపట్టారు. మరోవైపు గ్రామాల్లో ట్రాక్టర్ల కు బాగా గిరాకీ పెరిగింది. అదేవిధంగా విత్తనాలు వేసేందుకు కూలీల డిమాండ్ కూడా బాగా పెరిగింది.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి
- ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి



బీసీ కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట గ్రామంలో ప్రాథమిక మినీ ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణానికి అదే విధంగా పల్లమరి గ్రామంలో డ్రైయినేజీ నిర్మాణానికి, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. అలాగే బీసీ కమ్యూనిటి హాల్ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నాడన్నారు. అందుకు గ్రామాలల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం చేపడుతున్నాడన్నారు. ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతూ గ్రామాల్లో వైద్య ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాడని వివరించారు. అంతేకాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాడ పేర్కొన్నారు. అభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెట్పీటీసీ వట్టెం రాజేశ్వరి రాము, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమావేశం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

జడ్చర్ల టౌన్: ఆర్యసమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్థానిక దయానంద విద్యామందిరంలో (2006-07)ఏడాది పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో నృత్యాలు చేస్తూ వేద ఉపన్యాసాలు విని తరించారు. ఆయా రంగాల్లో స్థిరపడిన వారు తమ అనుభవాలను, పాఠశాలలోని గతస్మృతులను తోటి వారితో పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం గుబ్బ నర్సింహులు, బక్క రాజేశ్వర్, బీచని లవకుమార్, తడకమళ్ల ప్రభాకర్, జనార్దన్, మాజీ ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ప్రజా వ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని టీపీసీసీ సెక్రటరీ అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దేవునిగుట్ట తండాలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపాలని కోరారు. అనేక రకాలుగా పేదలపై భారం మోపారని విమర్శించారు. రుణ మాఫీ ఇప్పటి వరకు చేయలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణ మాఫీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

తండాకు చెందిన ఉపసర్పంచ్ తౌర్యానాయక్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి అనిరుధ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గంగ్యానాయక్, వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా ఎరుకల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్, జేఈఈ, నీట్ పరీక్షల్లో మంచి మార్కులు, ర్యాంక్‌లు సాధించిన ఎరుకల విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకట్రాములు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకట్రాములు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలని కోరారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బాలయ్య, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ (యుడబ్ల్యూఎస్) ఎం.ఆంజనేయులు తండ్రి మానుపాడి పెద్దన్న జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయించారు.

రాష్ట్ర ఏర్పాటుతో దేవాలయాల అభివృద్ధి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: రాష్ట్రం ఏర్పడ్డాక దేవాలయాల అభివృద్ధి సాధ్యమైందని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదిఆంజనేయస్వామి దేవాలయ పునఃనిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ దేవాలయ నిర్మాణానికి దేవదాయశాఖ ఆధ్వర్యంలో రూ. 50 లక్షలు మంజూరు చేశారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాములు తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి

గండేడ్: ముదిరాజ్‌లను అవమానించిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని మండల సంఘం ప్రధాన కార్యదర్శి కేశవులు డిమాండ్ చేశారు. ఆదివారం గండీడ్ మండల కేంద్రంలో దిష్టి బొమ్మ దహనం చేశారు. ఘటన పై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు గిరమోని అంజిలయ్య, చెన్నయ్యపల్లి వెంకటయ్య, పీఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గోపాల్, బాల్‌రాజు, కొమ్మురినర్సిములు, వెంకటయ్య పాల్గొన్నారు.

వర్షాల కురవాలని వనాలకు..

అడ్డాకుల: మూసాపేట మండలంలోని మహ్మదుస్సేన్‌పల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్తులు వనాలకు వెళ్లారు. వర్షాలు కురవాలనే ఆకాంక్షతో ఉదయమే కార్యక్రమం చేపట్టారు. ఇళ్లకు తాళాలు వేసి జంతువులను సైతం తమ తీసుకెళ్లారు. అక్కడే వనభోజనాలు చేశారు. గ్రామస్తులతో పాటు ఇతరులెవరు రాకుండా గ్రామ సేవకులు పహారా కాశారు. సర్పంచ్ నిర్మల, ఉప సర్పంచ్ మధు, గ్రామస్తులు ఉన్నారు.

గార్లపహాడ్‌ను మండలం చేయాలి

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను నూతన మండలంగా ప్రకటించాలని జేఏసీ కన్వీనర్ రామునాయక్ అన్నారు. ఆదివారం నిర్వహించిన రిలేదీక్షలకు ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ గార్లపహాడ్‌ను వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి చేయూత

పాలమూరు: జిల్లా కేంద్రంలో పాత వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమీపంలో బిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్న ఆనంద్ అనే 60 ఏళ్ల వృద్ధుడిని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు చేరదీశారు. కాలికి తీవ్రమైన గాయాలతో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడికి స్నానం చేయించి, కొత్త దుస్తులు వేయించి హైదరాబాద్‌లో ఉన్న అనాథ శరణాలయంలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు సాల్మన్ రాజ్, అక్షయ్, స్టీవా, అరుణ్, సాగర్, ద్యాని, నిఖిల్, అజయ్, రవితేజ పాల్గొన్నారు.

మహబూబ్‌అలీకి ఘన నివాళి

స్టేషన్ మహబూబ్‌నగర్: అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి చెందిన రెండో ప్రపంచయుద్ధంలో పాల్గొన్న సైనికుడు మహబూబ్ అలీకి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. మహబూబ్‌అలీ ధైర్య సాహసాలు, విజయాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా మాట్లాడుతూ మహబూబ్‌అలీ సైనికుడితోపాటు కళాకారుడన్నారు. రెండోప్రపంచ యుద్ధం సైనికుల స్థూపం నిర్మించాలని కోరుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు మెయిల్‌ద్వారా వినతిపత్రం పంపించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఎండీ.యాఖూబ్ పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని టీఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నెలకు రూ. 27 వేలు వేతనం ఇవ్వాలన్నారు. స్వరాష్ట్రంలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈనెల 26 నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట నివదిక దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గట్టన్న, నాయకులు చంద్రాయుడు, బాలగౌడ్, వెంకటయ్య, జిల్లా కార్యదర్శి బాలనాగయ్య, ఖాజాపాషా పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

భూత్పూర్: కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని సిద్ధాయిపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్త ఉదయగిరి కేశవులు ఇంటికి వెళ్లి రైతుబీమా, బీఆర్ఎస్ పార్టీ ఇన్సురెన్స్ రూ.7 లక్షల విలువ గల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు స్వయంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వెళ్లి అందజేశారు. అనంతరం కార్యకర్త చేకూరి వెంకటయ్య 4వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, ముడా డైరక్టర్లు చంద్రశేఖర్ గౌడ్, సాయిలు తదితరులు ఉన్నారు.

త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం దోమలగూడలోని జీసీపీఈ ఆడిటోరియంలో రాష్ట్ర త్రోబాల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ మేరకు (2023–2027 వరకు) త్రోబాల్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా రాష్ట్ర అధ్యక్షుడిగా హర్షవర్ధన్‌రెడ్డితోపాటు జిల్లా కేంద్రానికి చెందిన పీడీ వడెన్న రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణస్థాయికి త్రోబాల్ క్రీడను తీసుకెళ్తాతామని అన్నారు. ప్రతి పాఠశాలలో, స్టేడియంలలో త్రోబాల్ ఆడేలా అసోసియేషన్ తరపున తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైకుంఠధామం ఏర్పాటు చేయండి

జడ్చర్ల: పట్టణ పరిధిలో క్రిస్టియన్ మైనార్టీలకు వైకుంఠధామం ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు, పాలకులు కృషి చేయాలని బాదేపల్లి క్రీస్తురాజు దేవాలయం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తమ వారు మరణిస్తే సొంత గ్రామాలకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఎంతోకాలంగా తమకు స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పందించి తమకు న్యాయం చేసి స్థలాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారికి సన్మానం

పాలమూరు: బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు 1975లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసి అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్లి వచ్చిన వారిని జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, కాళ్లరామచంద్రయ్య, అచ్చుగట్ల చిన్నయ్య, సాయిలు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ఆర్థికసాయం



కోయిల్‌కొండ: మల్కాపూర్‌నకు చెందిన వడ్డెపెద్దరాజు, అనంతమ్మ దంపతులు రోడ్డు ప్రమాదంలో 20రోజుల క్రితం మృతిచెందడంతో వారి ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మారిన విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన చెల్లాపురం శ్రీనివాస్ రెడ్డి (హైదరాబాద్‌లో విజిలెన్స్ సీఐ) తన స్నేహితులకు విషయం వివరించగా వారు వెంటనే స్పందించారు. రూ. 2.50 లక్షలు ఆర్థికసాయం అందించారు. సంబంధిత చెక్కును శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం అందజేశారు. అదేవిధంగా ముగ్గురు పిల్లలకు వివాహం వరకు ప్రతి నెల రూ. 1000 అందజేస్తామని వారు హామీ ఇచ్చారని వివరించారు. ఈ మేరకు శ్రీనివాస్‌రెడ్డి పలువురు అభినందించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్థసారథి

మహబూబ్‌నగర్ రూరల్: ఎన్నికల ప్రక్రియ మొదలైనందున బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ బి.పార్థసారథి అన్నారు. ఆదివారం కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత వివరాలను ఫామ్ 6లో పొందుపరిచి ఓటరుగా నమోదు చేయాలని అన్నారు. మరణించిన ఓటరు వివరాలను ఫామ్ 7లో నమోదు చేసి జాబితా నుంచి తొలగించాలని అన్నారు. చిరునామా మార్పులు చేర్పులు, తప్పుల సవరణను ఫామ్ 8 ద్వారా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రక్రియను నెలాఖరులోగా ముగించేందుకు గడువు విధించారని, ఈలోగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజగోపాల్, జూనియర్ అసిస్టెంట్ శరత్, టైపిస్ట్ మదన్ తదితరులుపాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న నర్సిములు

కోయిల్‌కొండ: గ్రామపంచాయతీ కార్మికులకు జీ.వో నెం.60 ప్రకారం వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎదురింటి నర్సిములు అన్నారు. ఆదివారం మండలంలోని గార్లపహాడ్‌లో మండల పంచాయతీ కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 6 నుంచి ప్రారంభిస్తున్న రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల నష్టపరిహారం అందించాలన్నారు. కార్మికులు శ్రీనునాయక్, అజ్జు, పాషా, రవి, వెంకటయ్య, గోపాల్, రాందాస్, బాలకృష్ణ, కేశవులు, రాజు, చెన్నయ్య, రాము పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



బండ్లగేరిలో సర్వే నిర్వహిస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బండ్లగేరి, కిసాన్‌నగర్‌లలో సీఐటీయూ, ఐద్వా, కేవీపీఎస్, పీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరద గాలెన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య, సీఐటీయూ పట్టణ నాయకులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకులలో ఇంటింటి సర్వే..

అడ్డాకుల: మండల కేంద్రంలో ఆదివారం సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, కేవీపీఎస్ జిల్లా నాయకులు కురుమూర్తి, బాలరాజు అడ్డాకులలోని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు తదితర అంశాలపై వివరాలను సేకరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 26, 27న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టనున్నట్లు వివరించారు. అదేవిధంగా జూలై 3న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు.

విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి



విద్యార్థులతో ముడా చైర్మన్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్ గంజి వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులను ఘనంగా సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపుతోపాటు మానసికంగా ఎదగవచ్చన్నారు. చిన్నారులు కరాటే శిక్షణ తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేష్ మాట్లాడుతూ కింగ్‌షోటోకాన్ క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో కొన్నేళ్ల నుంచి ఉచిత వేసవి కరాటే శిక్షణా శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఆయా విభాగాల్లో విద్యార్థులు పతకాలు సాధించినట్లు తెలిపారు. కౌన్సిలర్ కిషోర్, క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్, కార్యదర్శి అబ్దుల్ జకీ, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నవసంకల్ప యాత్రకు తరలిన నాయకులు



మిడ్జిల్ నుంచి తరలిన నాయకులు

మిడ్జిల్: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నవ సంకల్ప యాత్రకు మండలం నుంచి బీజేపీ నాయకులు కార్యకర్తలు వివిధ వాహనాలలో భారీగా తరలివెళ్లారు. నాయకులు రాజేశ్వర్, తిరుపతి, నరేందర్, వాస్‌దేవ్, అంజి, శివ, లక్ష్మన్ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: నాగర్‌కర్నూలులో నిర్వహించిన మహాజన్‌సంపర్క్ మహాసభకు జడ్చర్ల నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. డా.మధుసూదన్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

నవాబుపేట: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తునే ఉంటామని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. ఆదివారం చౌడూర్, కొల్లూర్, జంగమయ్యపల్లి, పోమాల్ గ్రామాల్లో పర్యటించి ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగ్లారవి, రాజేష్, ఖాజా, ఎంపీటీసీ రాంచందర్ తదితరులు ఉన్నారు.

లోకకల్యాణార్థం గ్రామదేవతల సందర్శన

జడ్చర్ల టౌన్: రాష్ట్రంలో ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ రాష్ట్రసంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్ గ్రామదేవతలను సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ నెల 12న భాగ్యేశ్వరాలయంలో శివుడికి రుద్రాభిషేకంతో ప్రారంభించిన కార్యక్రమం ఆదివారంతో 63 దేవాలయాల సందర్శన పూర్తిచేశారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ఆలయాలు సందర్శించారు. శ్రీగిరిక్షేత్రంలో రుద్రాభిషేకం చేశారు. తుల్జాభవాని ఆలయంలో యజ్ఞంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మారుమూల గ్రామాలకు వైద్యసేవలు

నవాబుపేట: మారుమూల గ్రామాలకు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఇండియన్ మెడికల్ అండ్ హెల్త్ ద్వార ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ వైద్యుడు డాక్టర్ రాఘవేంద్రకుమార్ తెలిపారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా సిరి చిన్న పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం కాకర్లపహాడ్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 139 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ జంగమ్మ, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.